

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 07-09-2026 | సంపుటి - 31 | సంచిక - 105 | రూ : 4 | పేజీలు: 8


# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనంతా విధ్వంసమే

## పాలించడం చేతకాకే నాపై అనుచిత వ్యాఖ్యలు



- సాగునీటి కోసం మరో యుద్ధం.. నేనే నేతృత్వం వహిస్తా
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై ప్రజల వద్దకెళ్దాం
- భూమాఫియాతో ప్రజలకు ఇబ్బందులు
- ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై అసెంబ్లీ, మండలిలో గట్టిగా నిలదీయాలి
- భారాస ఎల్పీ సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్ అని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ దిగజారుతోందని, ఏమీ చేయలేక తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమై అడ్డగోలుగా దోపిడీకి తెగబడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో భూమాఫియా విచ్చలవిడిగా పేట్రేగిపోతోందని, 22ఏతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని నివాసంలో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆదివారం కేసీఆర్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పాలన చేతకాకే తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పరోక్షంగా ముఖ్యమంత్రిని తరువాయి 2లో



## 22ఏ సమస్య ఎందుకొచ్చింది?

- ఆరా తీసిన ముఖ్యమంత్రి
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలపై అధికారులతో సమావేశం

హైదరాబాద్: భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పలు భూ సంబంధిత సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా తీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా నిషేధిత జాబితా అంశంపైనా ఆయన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. "గతంలో ఎప్పుడూ ఈ సమస్య లేదు కదా.. 22ఏ వివాదంగా మారడానికి అసలు కారణాలు ఏంటి' అని సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ వివరాలు తెలియజేసినట్లు తెలిసింది. 22ఏ సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయని తరువాయి 2లో

## తప్పిన విమాన ప్రమాదం

### బెంగళూరులో సురక్షిత ల్యాండింగ్



2లో

- బెంగళూరు నుంచి లండన్ వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం
- టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సమస్యను గుర్తించిన పైలట్లు
- తుమకూరు సమీపంలో అరగంట పాటు గాల్లో చక్కర్లు కొట్టిన విమానం
- సుమారు 270 మంది ప్రయాణికులతో సురక్షితంగా వెనక్కి ల్యాండింగ్
- విమానాన్ని రద్దు చేసిన వర్జిన్ అట్లాంటిక్.. ప్రయాణికులకు క్షమాపణ



## భవనం కూలి ముగ్గురి మృతి

### ఢిల్లీలో విషాదం

- ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం 2లో
- ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు
- మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్
- శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు

## హైదరాబాద్ మెట్రోకు కొత్త కోచ్‌లు

### తెరపైకి వచ్చిన సాంకేతిక సమస్య



- హైదరాబాద్ మెట్రోలో కొత్త కోచ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ సన్నాహాలు
- పాత సిగ్నలింగ్ వ్యవస్థతో అనుసంధానంపై సాంకేతిక సవాలు
- మొత్తం వ్యవస్థను ఆధునికీకరించాలని సూచించిన డీఎంఆర్సీ
- భవిష్యత్ అవసరాల కోసమే ఈ సిఫార్సు అని నిపుణుల అభిప్రాయం 2లో

## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..

### వాళ్లంతా బయటకొచ్చారు



- 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ
- గత ప్రభుత్వాల హయాంలోని వైఫల్యాలను విద్యార్థులకు వివరించిన ప్రధాని 2లో

## ప్రైవేటీకరణ అంటూ కథనాలు..

### క్లారిటీ ఇచ్చిన ఇస్రో

- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు.

తరువాయి 2లో



## అనక్ క్రాకటోవా విస్ఫోటనం

### నిలిచిన విమానాలు

- జకార్తాను కమ్మేసిన బూడిద మేఘాలు
- 300కు పైగా విమాన సర్వీసులు రద్దు
- వేలాది అడుగుల ఎత్తుకు ఎగిసిపడుతున్న బూడిద, ధూళి
- సునామీ ప్రమాదం లేదని స్పష్టం చేసిన ఇండోనేషియా అధికారులు
- బూడిద కారణంగా పలుచోట్ల పాఠశాలలకు సెలవులు, జనజీవనంపై ప్రభావం 2లో

# తప్పిన విమాన ప్రమాదం.. బెంగళూరులో సురక్షిత ల్యాండింగ్

బెంగళూరు నుంచి లండన్ వెళ్లాల్సిన వర్జిన్ అట్లాంటిక్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే వెనక్కి తిరిగి వచ్చింది. సుమారు 270 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ఆదివారం ఉదయం కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయ్యింది. ప్రయాణికులు, సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు ప్రకటించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, వర్జిన్ అట్లాంటిక్ విమానానికి చెందిన VS317 సర్వీస్, బోయింగ్ 7879 విమానం, ఈరోజు ఉదయం 8:20 గంటలకు కెంపెగౌడ విమానాశ్రయం టెర్మినల్ 2 నుంచి లండన్



హీత్రూకు బయలుదేరింది. అయితే, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక సమస్యను పైలట్లు గుర్తించారు. దీంతో, లండన్ ప్రయాణాన్ని కొనసాగించకుండా, ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని వెనక్కి మళ్లించాలని నిర్ణయించారు. బెంగళూరు విమానాశ్రయానికి తిరిగి వచ్చే ముందు, విమానాన్ని సుమారు అరగంటకు పైగా తుమకూరు సమీపంలోని గగనతలంలో చక్కర్లు కొట్టించారు. అనంతరం, కెంపెగౌడ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానాశ్రయ నిర్వాహక సంస్థ అయిన బెంగళూర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (BIAL) ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నట్లు ధ్రువీకరించింది. ఈ ఘటనపై వర్జిన్ అట్లాంటిక్ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. "సాంకేతిక సమస్య కారణంగా బెంగళూరు లండన్ విమానం వెనక్కి తిరిగి వచ్చింది. విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ సర్వీస్‌ను రద్దు చేశాం. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మాకు అత్యంత ముఖ్యం. కలిగిన అసౌకర్యానికి ప్రయాణికులకు క్షమాపణలు చెబుతున్నాం. ప్రభావితమైన వారికి మా బృందాలు సహకరిస్తున్నాయి. వీలైనంత త్వరగా ప్రత్యామ్నాయ విమానాల్లో వారికి సీట్లు కేటాయించేందుకు కృషి చేస్తున్నాం," అని ఆ ప్రకటనలో పేర్కొంది. విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్యకు కచ్చితమైన కారణమేమిటనేది ఇంకా తెలియరాలేదు. విమానాశ్రయ అధికారులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త సర్ రిచర్డ్ బ్రాన్సన్ స్థాపించిన వర్జిన్ గ్రూప్‌కు ఈ ఎయిర్‌లైన్స్‌లో 51% వాటా ఉండగా, మిగిలిన 49% వాటాను అమెరికాకు చెందిన డెల్టా ఎయిర్ లైన్స్ కలిగి ఉంది.

## 22ఏ సమస్య ఎందుకొచ్చింది?

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ పరిసర జిల్లాల్లోనే సమస్య కనిపించిందని.. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించినట్లు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. భూ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలంటూ సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రిని ఆదేశించారు. సమావేశానికి పలువురు కలెక్టర్లు హాజరయ్యారు.

**మంత్రి పొంగులేటి సమీక్ష**

నిషేధిత భూముల జాబితా అంశం శాసనసభ సమావేశాల్లో చర్చకు రానున్న నేపథ్యంలో దీనిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలను ఈ వేదికగా ప్రజలకు వెల్లడించేందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిద్ధమయ్యారు. హైకోర్టు ఆదేశాలతో 2025 చివర్లో జాబితాలను రిజిస్ట్రేషన్ల శాఖ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ క్రమంలో కొన్ని ప్రైవేటు ఆస్తులు కూడా ఆ జాబితాలో ఉన్నాయంటూ ప్రతిపక్షాలు ప్రశ్నిస్తూ వస్తున్నాయి. పాత జాబితాలో ఏ వివరాలు ఉన్నాయి, కొత్తగా అప్‌లోడ్ చేసిన జాబితాలో ఉన్న వివరాలు ఏంటనేది సభలో మంత్రి వివరించనున్నట్లు తెలిసింది.

## అనక్ క్రాకటోవా విస్ఫోటనం.. నిలిచిన విమానాలు

ఇండోనేషియాలోని అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం మరోసారి బద్ధలైంది. శుక్రవారం రాత్రి నుంచి ఉగ్రరూపం దాల్చిన ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద, ధూళి మేఘాల కారణంగా రాజధాని జకార్తాలో విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముందుజాగ్రత్త చర్యగా సోకర్నో హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో 300కు పైగా విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడిన బూడిద ఆదివారం ఉదయం జకార్తా విమానాశ్రయ పరిసరాలను కమ్మేసింది. దీంతో అధికారులు తొలుత ఉదయం 9:30 గంటల వరకు, ఆ తర్వాత సాయంత్రం 5:30 గంటల వరకు విమాన రాకపోకలను నిలిపివేశారు. మొత్తం 301 విమానాలను రద్దు చేయగా, వాటిలో 58 అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి. ఈ పరిణామంతో 22,000 మందికి పైగా ప్రయాణికులపై ప్రభావం పడింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్ వంటి సంస్థలు జకార్తాకు తమ సర్వీసులను రద్దు చేసుకున్నాయి. సింగపూర్, దోహా, సిడ్నీ, కౌలాలంపూర్ వంటి ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. అగ్నిపర్వతం నుంచి బూడిద మేఘాలు జావా వైపు 20,000 అడుగులు, సుమత్రా వైపు 50,000 అడుగుల ఎత్తు వరకు వ్యాపించాయి. నిరంతర భూ ప్రకంపనలు, లావా వెదజల్లడం, భారీ శబ్దాలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. బూడిద కారణంగా కంటికి సంబంధించిన సమస్యలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మత్స్యకారులు కూడా సముద్రంలోకి వేటకు వెళ్లలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు, కళ్లజోళ్లు తప్పనిసరిగా ధరించాలని ఇండోనేషియా విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. ప్రస్తుతానికి సునామీ ముప్పు ఏదీ లేదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, ప్రజల్లో ఆందోళన నెలకొంది. 2018లో ఇదే అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా సంభవించిన సునామీలో 400 మందికి పైగా మరణించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ అగ్నిపర్వతాలు, భూకంపాలు సంభవించడం సాధారణమే.

## హైదరాబాద్ మెట్రోకు కొత్త కోచ్‌లు..
## తెరపైకి వచ్చిన సాంకేతిక సమస్య

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు మెట్రో రైలు వ్యవస్థలో అదనపు కోచ్‌లను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తుండగా, ఈ ప్రక్రియలో ఒక కీలకమైన సాంకేతిక సవాలు ఎదురైంది. కొత్తగా కొనుగోలు చేసే కోచ్‌లను పాత సిగ్నలింగ్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయాలా? లేక మొత్తం సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్ వ్యవస్థనే ఆధునికీకరించాలా? అనే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. అయితే, ప్రస్తుత వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించడమే దీర్ఘకాలంలో ప్రయోజనకరమని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) నిపుణులు సూచించినట్లు తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో 57 రైలు సెట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో రైలులో మూడు కోచ్‌లు ఉంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కార్యాలయాలకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరగడంతో ఈ రైళ్లు ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు 60 కొత్త కోచ్‌లు, అంటే 10 కొత్త మూడు కోచ్‌ల ట్రైన్ సెట్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అయితే, దాదాపు 12 ఏళ్ల నాటి సాంకేతికతతో నడుస్తున్న ప్రస్తుత వ్యవస్థతో కొత్త కోచ్‌లను అనుసంధానించడం పెద్ద సవాలుగా మారింది. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో ఏర్పాటు చేసిన రోలింగ్ స్టాక్‌ను ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ), ఆటోమేటిక్ ట్రైన్ ఆపరేషన్ (ఏటీఓ), కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ (సీబీటీసీ) వంటి టెక్నాలజీలతో రూపొందించారు. ఇటీవల హైదరాబాద్‌లో పర్యటించిన డీఎంఆర్‌సీ ఇంజినీర్లు ఈ అంశంపై మెట్రో అధికారులతో చర్చించారు. పాత టెక్నాలజీకి అనుగుణంగా కొత్త కోచ్‌లను ప్రత్యేకంగా తయారు చేయించడం కంటే, మొత్తం సిగ్నలింగ్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడమే ఉత్తమమని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రస్తుతం ఉన్న పాత కోచ్‌లలో అవసరమైన మార్పులు చేస్తే, భవిష్యత్తులో కొత్త రైళ్లను సమీకరించడం చాలా సులభం అవుతుంది. దీనివల్ల పాత, కొత్త రైళ్ల మధ్య సాంకేతిక అనుసంధానం మెరుగుపడుతుంది. అంతేకాకుండా రైళ్ల భద్రత, వేగం, సమయపాలన మరింత మెరుగుపడతాయి. ఈ విధానం వల్ల మెట్రో వ్యవస్థ భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా సిద్ధమవుతుందని, దీర్ఘకాలంలో నిర్వహణ కూడా సులభతరం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

## ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

(మొదటిపేజీ తరువాయి)

అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

**భవిష్యత్ లక్ష్యాలు ఇవే..**

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది. ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా.. వాళ్లంతా బయటకొచ్చారు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్‌ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్' అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం" అని వివరించారు. "అదేవిధంగా, నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు" అని అన్నారు. గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. "నేను మీకు చాలా విషయాలు చెప్పాను. 'ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?' అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. 2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. "అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు" అని గుర్తుచేశారు. అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. "2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది" అని ఆయన పేర్కొన్నారు. తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. "మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి 'ఇక భారత్ నిలబడదు' అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే 'ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు' అని సంతోషించారు. కానీ, నా దేశ ప్రజల ఆశీర్వాదాలకు ఎంత శక్తి ఉందంటే, భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ప్రతి కోరిక నెరవేరడం లేదు" అని మోదీ వ్యాఖ్యానించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మోదీ ఎస్‌ఆర్‌సీసీని సందర్శించారు. అప్పుడు విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనంతా విధ్వంసమే

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్ అని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ దిగజారుతోందని, ఏమీ చేయలేక తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమై అడ్డగోలుగా దోపిడీకి తెగబడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో భూమాఫియా విచ్చలవిడిగా పేట్రేగిపోతోందని, 22ఏతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని నివాసంలో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆదివారం కేసీఆర్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పాలన చేతకాకే తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పరోక్షంగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉద్ధృతంగా పోరాటం చేయాలని, కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై ప్రజల వద్దకు వెళ్దామన్నారు. రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, సాగునీటి కోసం మరో యుద్ధానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. లక్షల మందితో త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని, ఆ జల ఉద్యమానికి తానే నేతృత్వం వహిస్తానని స్పష్టం చేశారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై గట్టిగా నిలదీయాలని, సమావేశాల్లో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని సూచించారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ప్రజల ఎజెండానే భారాస ఎజెండాగా ఉండాలని వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందన్నారు.

## భవనం కూలి ముగ్గురి మృతి ఢిల్లీలో విషాదం

దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 4050 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## మంత్రి జూపల్లికి కలెక్టర్ ఘన స్వాగతం



ప్రజా స్ఫూర్తి, భైంసా : వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం బాసరకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఘన స్వాగతం పలికారు. బాసర రాజన్న అతిథి గృహంలో మంత్రికి పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసు అధికారులు మంత్రికి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ మట్ట చెన్నయ్య గౌడ్‌కు నేషనల్ ఎడ్యుకేషనల్ అవార్డు




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో సెప్టెంబర్ 5న ఇండియా బుక్ ఆఫ్ అచీవ్‌మెంట్స్ (ఐబిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఎడ్యుకేషన్ అవార్డ్స్-2026 కార్యక్రమంలో నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలోని శ్రీకృష్ణవేణి హైస్కూల్ కరస్పాండెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ మట్ట చెన్నయ్య గౌడ్‌ను ప్రతిష్ఠాత్మక నేషనల్ ఎడ్యుకేషనల్ అవార్డు-2026తో ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడంలో డాక్టర్ మట్ట చెన్నయ్య గౌడ్ చేస్తున్న కృషిని ఐబీఏ జ్యూరీ కమిటీ గుర్తించింది. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు వివిధ విద్యా సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు మరియు కళాశాలల్లో నిర్వహిస్తున్న మోటివేషన్ సెషన్స్‌ను అవార్డు కమిటీ ప్రశంసించింది. అలాగే అంజలి మట్టా ఎల్లయ్య గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ, విద్యతో పాటు సామాజిక సేవ, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ అభివృద్ధి మరియు మహిళా సాధికారతకు చేస్తున్న సేవలను కూడా ఐబీఏ ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా చెన్నాయ్యా గౌడ్ మాట్లాడుతూ, "ఈ అవార్డు నాకు ఎంతో ఆనందాన్ని, మరింత బాధ్యతను కలిగించింది. ఇది నా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు. శ్రీకృష్ణవేణి హైస్కూల్ టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల నిరంతర సహకారానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాను" అని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు, భవిష్యత్తులో మరిన్ని విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతానని ఆయన పేర్కొన్నారు. తనను నేషనల్ ఎడ్యుకేషనల్ అవార్డుకు ఎంపిక చేసిన ఇండియా బుక్ ఆఫ్ అచీవ్‌మెంట్స్ జ్యూరీ కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి విద్యారంగంలో విశేష సేవలందిస్తూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న డాక్టర్ మట్టా చెన్నాయ్యా గౌడ్‌కు నేషనల్ ఎడ్యుకేషనల్ అవార్డు లభించడం పట్ల శ్రీకృష్ణవేణి హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా ఆటో నడిపిన మాజీ మంత్రి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా, కురవి మండలం, పెద్దతండా గ్రామంలో ఆటో డ్రైవర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు సత్యవతి రాథోడ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ దేవత బొడ్రాయిని దర్శించుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని మొక్కుకున్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా ఆ హామీని నెరవేర్చలేదని సత్యవతి రాథోడ్ విమర్శించారు. ఆటో డ్రైవర్ల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్న ఆమె, వారికి మద్దతుగా స్వయంగా ఆటో నడిపి నిరసనలో పాల్గొనడం విశేషం. నిరసనకు వచ్చిన కార్మికులకు సొంతంగా కిరాయి ఇచ్చి వారిని ఆదుకున్నారు. ఇక మిగిలింది 800 రోజులే, ఈ లోపైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని" ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర సర్పంచుల సదస్సులో పాల్గొన్న గరిడేపల్లి మండల సర్పంచులు




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర రాజధాని హైదరాబాదు లో గచ్చిబౌలి బ్రహ్మకుమారి శాంతి సర్వర్ కన్వర్షన్ రాష్ట్ర సర్పంచుల సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్క గ్రామీణ అభివృద్ధి శాఖ స్టేట్ కమిషనర్ దివ్య సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్ గరిడపల్లి మండల సర్పంచ్లు ఫోరం అధ్యక్షుడు కటికం వేణు కుతుబ్ షా పురం సర్పంచ్ ఆకుల కృష్ణ సర్పంచ్ నాతాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బోనమెత్తిన కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: జిల్లా కేంద్రంలోని భువనగిరి మున్సిపల్ పట్టణం 23వ వార్డులో శ్రావణమాసం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మారెమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో, డప్పు వాయిద్యాల నడుమ పురవీధుల గుండా ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల వేషధారణలో యువకుల నృత్యాలు, డప్పుల దరువులతో వార్డులో పండుగ సందడి నెలకొంది. అంతకుముందు అమ్మవారికి జల్దిబిందె ఊరేగింపు నిర్వహించి అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్, బర్రె మహాలక్ష్మి రమేష్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 10న ప్రాంతీయ స్థాయి డాక్ అదాలత్

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : తపాలా సేవలకు సంబంధించిన ప్రజల ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 10న ఉదయం 11:00 గంటలకు ప్రాంతీయ స్థాయి డాక్ అదాలత్ నిర్వహించబడుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ - II రెండ్ల సత్యనారాయణ తెలిపారు. ఈ డాక్ అదాలత్‌ను హైదరాబాద్ లోని పోస్టుమాస్టర్ జనరల్, ప్రధాన కార్యాలయ ప్రాంతం జామా ఇఉస్మానియా పోస్టాఫీస్ భవనంలో వారు వర్చువల్ విధానం (ఆన్‌లైన్) ద్వారా నిర్వహిస్తారన్నారు. సిబ్బంది అంశాలు, సర్వీస్ అంశాలు, గౌరవ న్యాయస్థానాల్లో (అన్ని రకాల) పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన ఫిర్యాదులను డాక్ అదాలత్‌లో స్వీకరించరు.

*** ఫిర్యాదులు పంపవలసిన విధానం**

హైదరాబాద్, రంగారెడ్డి, మెద్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, సిద్దిపేట జిల్లాలకు చెందిన భారత తపాలా సేవలకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులు మరియు సమస్యలను ఆర్. సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్-II, పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, ప్రధాన కార్యాలయ ప్రాంతం, జామా ఇఉస్మానియా పోస్టాఫీస్ భవనం, హైదరాబాద్ - 500 007 వారికి ఈ నెల 08లోగా పంపవచ్చు. లేఖలను స్పష్టంగా, అర్థమయ్యే విధంగా రాయాలి. కవరుపై తప్పనిసరిగా "REGIONAL LEVEL DAK ADALAT" అని రాయాలన్నారు. ఫిర్యాదుదారులు తమ మొబైల్ నంబర్ / ఈమెయిల్ ఐడీ / చిరునామాను ఫిర్యాదుతో పాటు తప్పనిసరిగా తెలియజేయాలి. సమావేశంలో పాల్గొనేందుకు సంబంధించిన ఆన్‌లైన్ లింక్ వారి మొబైల్ నంబర్ / ఈమెయిల్ ఐడీకి పంపబడుతుందన్నారు.

## కరీంనగర్ కు కదిలిన కార్మిక సైన్యం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: కరీంనగర్ లో ఆదివారం నుండి మంగళవారం వరకు (సెప్టెంబర్ 6,7,8) మూడు రోజుల పాటు జరుగుతున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) నాల్గవ తెలంగాణ రాష్ట్ర మహాసభలకు మానుకోట జిల్లా నుండి వందలాది మంది కార్మికులు, నేతలు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. అజయ్ సారథి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ విలేకరులతో మాట్లాడుతూ మొదటి రోజు లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మూడు రోజుల మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు వెలుగు శ్రావణ్, మంద శంకర్, తండా శ్రీనాథ్, కొండమీది రవి, చిర్రా లక్ష్మీనరసమ్మ, ఎండి మహమూద్, జక్కరయ్య, రాము, నాగరాజు, ఉప్పలయ్య, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ ఎక్సలెన్స్ ఐకాన్ అవార్డ్స్ - 2026లో

*** షాద్ నగర్ న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కి అవార్డుల పంట**



ప్రజా స్ఫూర్తి, షాద్నగర్ : తెలంగాణ రాష్టంలో ఆమెచూర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అవార్డ్స్ అసోసియేషన్ అధ్యర్యంలో ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ ఎక్స్‌లెన్స్ ఐకాన్ అవార్డ్స్ 2026 హైదరాబాద్ లో ఘనంగా జరిగాయి. కరాటే, కుంగ్ ఫు విద్యలలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చిన వారిని ఎన్నుకొని ప్రతి సంవత్సరం ఈ అవార్డులు అందజేయడం జరుగుతుంది. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా అవార్డు ఫంక్షన్ సినీ కళాకారుల తో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ అవార్డు కార్యక్రమం లో షాద్ నగర్ పట్టణానికి చెందిన న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కి చెందిన విద్యార్థులు అవార్డులు కైవసం చేసుకొని తమ సత్తా చాటారు. ఇందులో కుంగ్ ఫు విద్యార్థులు నాజ్మా బేగం, ఇషిక రెడ్డి, సునైనా బేగం, వేదదిత్య, నాగ, కావలి దిక్షిత, దాన్విక, వాన్షిక, రక్షిత్, చరణ్ తేజ్, కమల్ దత్, సాత్విక్, దినేష్ తదితరులు తమ నైపుణ్యం కనబర్చిన సందర్భంగా గ్లోబల్ స్టార్ కిడ్స్ ఐకాన్ అవార్డ్స్ సొంతం చేసుకున్నారు. వీరికి సినీ కళాకారులైన శివం శివరాత్రి, గబ్బర్ సింగ్ సాయిబాబా, దువ్వూరి సంజయ్, సుహాని నాథ్ చైల్డ్ ఆర్టిస్ట్, మాస్టర్ కేశవ్ గౌడ్, అమర్ సింగ్, సం సాయి చేతులమీదుగా అవార్డులు అందజేశారు.

## బీజేపీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ గా గోలి ప్రభాకర్



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం కట్టంగూర్ మండలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గోలి ప్రభాకర్ కి బీజేపీ తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ గా నియమించి దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వర్ రావు ఉత్తర్వు కాఫీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు చేత ప్రభాకర్ కు ఇప్పించారు. ఈ సందర్భంగా గోలి ప్రభాకర్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నాకు ఈ బాధ్యత అప్పచెప్పిన కొల్లి నాగేశ్వర్రావు గారికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కి నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. గోలి ప్రభాకర్ నల్గొండ జిల్లా నుండి బీజేపీ ఎస్సీ మోర్చాలో రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎస్సీ మోర్చా నల్గొండ జిల్లా అధ్యక్షులు గా పని చేసారు 2009 లో తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్తిగా పోటీ చేసి మూడవ స్థానం లో నిలిచారు నకిరేకల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ గా తుంగతుర్తి అసెంబ్లీ బీజేపీ ఇంచార్జి గా కూడా పని చేసారు పార్టీ నియమ నిబంధనలు పాటిస్తూ పార్టీ కోసం అనేక విధాలుగా కృషి చేస్తున్నారు.

# అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. ఆదివారం చింతల్ డివిజన్ శ్రీనివాస్ నగర్ శ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ ముత్యపాగ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటేష్, కోశాధికారి పెరుమాళ్ళ గోపాల్, సభ్యులు బాబు రావు, అర్సింగ రావు, మేకల సత్యనారాయణ, మేకల కుమార్, స్వప్న, రవీందర్, సాయిరాం రెడ్డి, మాజీ కార్పొరేటర్ రషీదా మహమ్మద్ రఫీ, సీనియర్ నాయకులు మక్సూద్ అలీ, ఇస్మాయిల్, శౌకత్ అలీ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు..

## హైదర్ పివోపి వర్క్ షాప్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో డి మార్ట్ సమీపంలో హైదర్ పివోపి జిప్సమ్, పివిసి వర్క్ షాప్ ను ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు మెచ్చే విధంగా పనులు చేయాలని, వర్క్ ఆర్డర్లు పెంచడానికి ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉస్మాన్ మాట్లాడుతూ గృహాలకు, కార్యాలయాలకు సీలింగ్ అవసరాల కోసం తమను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరిశెట్టి లక్షాది, కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, ఫారూక్, నాయకులు అబ్దుల్ రహీం, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అండర్-16 స్కూల్ క్రికెట్ టోర్నీకి బీకేసీఏ క్రీడాకారుల ఎంపిక




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా క్రికెట్ అకాడమీ (బీకేసీఏ)కు చెందిన ముగ్గురు ప్రతిభావంతులైన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-16 స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన కె. మేఘ శర్వాన్ (ఎస్ఆర్ డిజి పాఠశాల), పి. జై గణేష్ రెడ్డి (శ్రీచైతన్య పాఠశాల), ఎ. సాయి సాకేత్ (నలంద జూనియర్ కళాశాల)లు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న టోర్నమెంట్‌లో వీరు ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదటి జట్టు తరపున బరిలోకి దిగనున్నారు. జిల్లా స్థాయి నుంచి ఉన్నత స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభించడంపై క్రీడాకారులు, తల్లిదండ్రులు, బీకేసీఏ కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు జిల్లా జట్టుకు ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. బీకేసీఏ కోచ్ పంతంగి సాయి నిరంజన్ మాట్లాడుతూ క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలతో క్రీడాకారులు ఈ స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మరింత కష్టపడి సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఎంపికైన ముగ్గురు క్రీడాకారులకు భద్రాద్రి కొత్తగూడెం క్రికెట్ అకాడమీ తరపున అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడే ప్రతి క్రీడాకారుడికి విజయం తప్పకుండా దక్కుతుందని కోచ్‌లు పేర్కొన్నారు.



# గురువే భావి తరాల బాటసారి : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

*** 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

జనగామ, ప్రజాస్ఫూర్తి : గురువులే సమాజ భవిష్యత్తు నిర్మాణ శిల్పులని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించాలని ఘనపూర్ (స్టేషన్) ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జనగామ కలెక్టరేట్‌లో ఆదివారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో నిజమైన మార్పుకు ఉపాధ్యాయుడే మార్గదర్శి అని అన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచాలని సూచించారు. అనంతరం జిల్లాలో విశిష్ట సేవలు అందించిన 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల న్యాయబద్ధమైన సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

* **బిఆర్ ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ ఉద్యోగుల న్యాయబద్ధమైన సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని బిఆర్ ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద టీఎస్ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్ఈయూ) కి చెందిన పలువురు ఉద్యోగులతో పాటు తెలంగాణ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సంఘం సభ్యులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షన్ విధానంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, న్యూ పిఆర్సి ని అమలు చేయడంతోపాటు పదవి విరమణ వయసు 60 ఏళ్ల కు పెంచాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న తెలంగాణ ఎంప్లాయిస్ ను తెలంగాణకు బదిలీ చేయాలని , భాషా పండితులకు, పిఈటి & 398 మంది స్పెషల్ టీచర్లకు న్యాయం చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులకు హౌసింగ్ ఫెసిలిటీని కల్పించాలి. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ప్రభుత్వంలో విలీనమైన ఆర్టీసీ ఉద్యోగులకు పే స్కేల్ ను అమలుపరచాలన్నారు. అదేవిధంగా ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యాన్ని అందజేయడంతోపాటు వారి పిల్లలకు ఉచిత విద్యను కల్పించాలన్నారు. జోనల్ వ్యవస్థను పునః పరిశీలించి , మహిళ ఉపాధ్యాయ ఉద్యోగినీలకు 6 నెలల ప్రసూతి సెలవుల సదుపాయం కల్పించాలన్నారు. జీవో నెంబర్ 81 & 85 ప్రకారం వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలన్నారు. అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ టీఎస్ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుల డిమాండ్లతో పాటు తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ సంఘం సభ్యుల న్యాయమైన డిమాండ్లను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి డిమాండ్లను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## ముత్యాలమ్మ బోనాల ప్రత్యేక పూజలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మండల కేంద్రమైన గరిడేపల్లిలో నేడు నిర్వహించనున్న ముత్యాలమ్మ బోనాల సందర్భంగా బొడ్రాయి, కోట మైసమ్మ, నూకాలమ్మ దేవాలయాల వద్ద ముందుగా గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా ముత్యాలమ్మ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సుఖ సంతోషాలు అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరారు. వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు ఉన్నారు

## బీఆర్ఎస్ వైపు యువత అడుగులు



భూపాలపల్లి, ప్రజా స్ఫూర్తి: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకు చెందిన సుమారు 150 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మనీష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరగా, గండ్ర వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. యువత భవిష్యత్తుతోపాటు భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ నిలుస్తోందని పేర్కొన్నారు. యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం ప్రజల్లో, ముఖ్యంగా యువతలో బీఆర్ఎస్పై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు.రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, 23వ వార్డు యువత పాల్గొన్నారు.

## ఘనంగా జిట్టా బాలకృష్ణారెడ్డి ద్వితీయ వర్ధంతి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు స్వర్గీయ జిట్టా బాలకృష్ణారెడ్డి 2 వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వద్ద జిట్టా అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ జిట్ట బాలకృష్ణారెడ్డి తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేశాడని ఆయన ఎంతోమంది కి ఆదర్శ ప్రాయుడని వారన్నారు ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, జిట్టా అభిమానులు చిలుకూరు సత్తిరెడ్డి, బొల్లు శ్రీనివాస్, నానచర్ల రమేష్, మస్కు నరసింహ, ఎండి సమ్మద్, కంకల శ్రీను, మోహన్, లగోని వెంకటేశం, కూర వెంకన్న ,కొండూరు సత్య, సురేష్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ శీలం స్వామి, బత్తిని రవీందర్ ,కాసుల వెంకన్న గౌడ్, కొండూరు సాయి, మారగొని శ్రీనివాస్ గౌడ్ ,బీసీ సంఘం మండలాధ్యక్షుడు సాయిని యాదగిరి, కంకల కిష్టయ్య ,సీనియర్ పాత్రికేయులు పడమటి దామోదర్ రెడ్డి ,రాపోలు సుదర్శన్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ వాహనాలకు ఆదరణ పెరిగింది



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:నేడు ఎలక్ట్రికల్ వాహనాలను ప్రజలు ఎక్కువ ఆదరిస్తున్నారని, పెట్రోలు ఖర్చు లేకుండా కేవలం చార్జింగ్ బ్యాటరీ ల ద్వారా నడిచే ఎలక్ట్రికల్ వాహనాలను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్త మార్కెట్ సమీపంలో ఆద్య ఎంవి ఇవి బైక్స్ షోరూంను ఆయన ప్రారంభించారు. ఎలక్ట్రికల్ వాహనాలు పర్యావరణానికి కూడా మేలు చేస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ , జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి , కీర్తి లవన్ గౌడ్, నాయకులు తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, అబ్దుల్ రహీం, బిజెపి పట్టణ అధ్యక్షుడు బూర మల్సూర్ గౌడ్, ఎమ్ జి కంపెని చైర్మన్ కొత్త మనోహర్ రెడ్డి, ఎండి సుప్రిత్ రెడ్డి, రవికుమార్, అమరగాని రాములు గౌడ్ , ప్రొప్రైటర్ పాపయ్య, చిలుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లికి రహదారుల సమస్యలపై వినతి పత్రం అందజేత

* **మాజీ ఎమ్మెల్యే గడ్డి గారి విఠల్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా తనూర్ మండలం లోని బోల్సా నుండి ఝరి బి గ్రామానికి వెళ్లే మార్గంలో లో లెవల్ వంతెన 2 సంవత్సరాల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయింది. కూలిపోవడం వలన ఆ రోడ్డుపై రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతుంది. బస్సులు,ఆటోలు, సైకిల్, మోటార్లు అంబులెన్స్, నడవకపోవడం వలన గ్రామానికి రాకపోవడం వలన ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుంది. దీనిపై ఎస్టిమేట్ కూడా వేయించటం జరిగింది. ఈ రోడ్డులో గల వంతెనను తొందరగా హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మించి రోడ్డును రేనోవేషన్ చేసి ఆ నాలుగు గ్రామాల ప్రజల ఝరి బి, భోల్సా, వాడఝరి, ఝరి బి తండా ఈ గ్రామాల ప్రజలకు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు మరియు మాజీ శాసనసభ్యులు ఈరోజు మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుకి విన్నవించడం జరిగింది. అలాగే ఈ రోడ్డుతో పాటు కుబీర్ మండలం లోని శివుని నుండి శివుని తండా 2 కు రోడ్డు, తానూరు నుండి మొగిలి గ్రామానికి ఇంతకుముందే టెండర్స్ జరిగినవి. రోడ్డు యొక్క శంకుస్థాపన కూడా చేయడం జరిగింది.త్వరగా పనులు ప్రారంభించాలని కోరటం జరిగింది.

## రుచుల లోకానికి కొత్త చిరునామా.. 'దశ ఫుడ్ పార్క్'

* **నాణ్యత, రుచితో ప్రత్యేక గుర్తింపు దిశగా అడుగులు**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఒక మంచి భోజనం ఆకలిని తీర్చడమే కాదు.. మనసుకు తృప్తినిస్తుంది. అలాంటి రుచిని, ఆత్మీయ ఆతిథ్యాన్ని ఒకే వేదికపై అందించాలనే ఆలోచనతో షాద్నగర్లో దశ ఫుడ్ పార్క్ కొలువుదీరింది. పట్టణంలోని మహబూబ్నగర్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ పార్క్ ప్రారంభోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది.ప్రారంభోత్సవ కార్యక్రమానికి షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, బీజేపీ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, 7వ వార్డు కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై దశ ఫుడ్ పార్కును ప్రారంభించారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ఫుడ్ పార్క్ నిర్వాహకులు భార్గవ కుమార్, నవీన్ కుమార్, మల్లికార్జున్, సురేష్లను అభినందించారు. కొత్తగా ప్రారంభమైన ఈ సంస్థ షాద్నగర్ ప్రజలకు నాణ్యమైన ఆహారం, మంచి రుచితో పాటు ఆత్మీయమైన సేవలను అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ప్రారంభోత్సవ వేడుక సందడిగా సాగింది.

## తెలంగాణ ఉద్యమకారుడు గీకురు రవీందర్ మృతి తీరని లోటు

* **మంత్రి పొన్నం ప్రభాకర్ రవీందర్ కుటుంబానికి 50లక్షలు ఇచ్చి ఆదుకోవాలి..**
* **బీఆర్ఎస్,బీఎస్పీ నాయకుల డిమాండ్..**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: గత నాలుగు రోజుల క్రితం మృతి చెందిన మాజీజెడ్పిటిసి,ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు గీకురు రవీందర్ కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ లు పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను కలిసి తీవ్ర దిగ్భ్రాంతిని, తమ గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అద్భుతమైన పోరాట పటిమ కలిగిన ఒక నికార్సైన బీసీ నాయకుడిని, తెలంగాణ ఉద్యమకారుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రం ఏర్పడే వరకు రవీందర్ అలుపెరగని పోరాటం చేశారని వారు గుర్తుచేశారు.తెలంగాణ కోసం అంతగా శ్రమించిన రవీందర్ కు కనీసం ఉద్యమకారుల పెన్షన్ కూడా అందకపోవడం విచారకరమన్నారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తక్షణమే స్పందించి,రవీందర్ కుటుంబానికి 50లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఉద్యమకారుల కుటుంబాన్ని సంరక్షించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై,ముఖ్యంగా మంత్రిపై ఉందని బీఆర్ఎస్,బీఎస్పీ పార్టీల పక్షాన వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలకు కదిలిన చిగురుమామిడి కార్మికలోకం



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: కరీంనగర్ జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలకు చిగురుమామిడి మండలం నుండి కార్మికులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.ఆదివారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన కార్మికులు స్వచ్ఛందంగా మహాసభల వైపు అడుగులు వేశారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గందె కొమురయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధన, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం, సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపును అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల రక్షణ, సంక్షేమం కోసం కేటాయించిన నిధులను వేరే పనులకు మళ్ళించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చిగురుమామిడి మండలం నుండి దాదాపు 150మంది కార్మికులు బస్సుల్లో తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి మండలానికి చెందిన ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు ఎనగందుల రాజు, గంగు కుమార్,పుట్ట మహేష్, పెనుకుల సదానందం, పొన్నం రవి,సంపత్, సుధాకర్,గిరబోయిన సంపత్,వివిధ రంగాల కార్మికులు,మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చందనపల్లి లో ఘనంగా బోనాల పండుగ



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : చందనపల్లి గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంధుమిత్రులతో కలిసి మహిళలు బోనాలు ఎత్తుకొని ఆడుతు పాడుతు గ్రామదేవతల దేవాలయాలకు చేరుకొని గ్రామ దేవతలకు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెద్ది లక్ష్మీ గోవర్ధన్ మాట్లాడుతూ బోనాల పండుగ మన సంస్కృతికి, సాంప్రదాయానికి మనలోని ఐక్య మత్యానికి ప్రతీక అని ఇలాంటి పండుగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణం లో జరుపుకోవాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో మన గ్రామం సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ గ్రామ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉప్పుల మురళి, తెలుగు మల్ల శ్రీను, ఏశ మల్ల గురువయ్య, తెలుగు మల్ల రామలింగయ్య, రవి, తెలుగు మల్ల అనిల్, గాదరి సాయి, వార్డు సభ్యులు, మహిళలు గ్రామస్తులు, కుల పెద్దలు తదిరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) రి.నెం. 1214/92 నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.మండల అధ్యక్షుడిగా బానోత్ శంకర్ నాయక్, కార్యదర్శిగా జి. కోటేశ్వరరావు, కోశాధికారిగా భూక్య సర్వన్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఆకుల రాజు, ఉపాధ్యక్షులుగా వి. వెంకన్న,భూక్య రాము,ముఖ్య సలహాదారుగా షేక్ యూసుఫ్,కార్యవర్గ సభ్యులుగా నల్ల నరసయ్య, రామచంద్రు,బి. వెంకన్న,బి. సురేష్, యాకయ్య ఎన్నికయ్యారు.అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధన కోసం, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి కార్మికుడికి అందేలా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## భక్తి విశ్వాసాల ప్రతిరూపమే జగజ్జనని దుర్గామాత



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: భక్తుల విశ్వాసం, అచంచల నమ్మకం తో ఆరాధించినప్పుడే జగన్మాత శ్రీ దుర్గా మాత ఆశీస్సులు లభిస్తాయిని, ఒక దేవాలయం నిర్మించే సంకల్పం సత్ సంప్రదాయమని, ఇది లోక కళ్యాణ అర్థం మంచి నిర్ణయమని ప్రవచనకర్త శ్రీ శ్రీ శ్రీ రాజేశ్వరి శర్మ ఉద్బోధించారు. శాంతినగర్ లో ఆదివారం రెండవ రోజు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ప్రతిష్టాపన ఉత్సవాలలో భాగంగా ముఖ్య అతిథిగా శ్రీ రాజేశ్వర శర్మ హాజరై ప్రసంగించారు. ఈరోజు మూల మంత్ర అనుష్టానములు, మండప దేవత హోమములు, పంచామృత ఆదివాసం, సాయంత్రము పుష్పాదివాసము, వస్త్రాధివాసం, తదుపరి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. చివరి రోజైన మూడవ రోజు సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన, దిష్టికుంభము, పూర్ణాహుతి, వేదాదిమంది భక్తులకు తదియారాధన నిర్వహించబడుతుందని ట్రస్ట్ చైర్మన్ ఉప్పల గురునాథం తెలిపారు. ఈరోజు కార్యక్రమం లో కంచి కామాక్షి జ్యోతిర్లింగ జాతీయ సభ్యులు శ్రీనివాస్ గుప్తా మరియు ఆలయ కమిటీ సభ్యులు మంచాల రంగయ్య, గుండా రమేష్, నూనె యుగంధర్, తల్లాడ వెంకటేశ్వర్లు, గజ్జల రవీందర్, మంచాల అంబరీష, కర్నాటి మధు, వీర్లపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు .

## విద్యానగర్ కాలనీలో కలుపు మందు పిచకారి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో ప్రతి వీధిలో కలుపు మందును స్ప్రే చేస్తున్నారు . గ్రామ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ కలుపు మందును స్ప్రే చేయుట ను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి వీధిలో దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించడంతోపాటు , దోమలు పెరగకుండా ఉండేందుకు పిచ్చి మొక్కలపై కలుపు మందును స్ప్రే చేస్తున్నట్లు ఆమె అన్నారు . గ్రామంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్య పనులు పైన ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు ఆమె అన్నారు . ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ నాగమణి , గ్రామపంచాయతీ ఈవో కె. వెంకటేశ్వర్లు , స్థానికులు పాల్గొన్నారు .

# భగవద్గీత సర్వ మానవాళికి జీవిత మార్గదర్శిని



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: శ్రీకృష్ణుడు ప్రబోధించిన భగవద్గీత సర్వ మానవాళికి జీవిత మార్గదర్శిని అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శ్రీ భారతీ తీర్థ సన్మాన గ్రహీత, ఆర్ష విద్య తపస్వి పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీతారామ ఫంక్షన్ హాల్ లో గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆశీస్సులతో దత్త విజయానంద తీర్థ స్వామీజీ వారి ఆదేశానుసారం నిర్వహించిన ద్వి సహస్ర గళ సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కురుక్షేత్ర రణరంగంలో అర్జునుడు విషాదంలో మునిగిపోయినప్పుడు, శ్రీకృష్ణ పరమాత్ముడు అందించిన ఈ బోధనలు నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరి ఒత్తిడిని, అజ్ఞానాన్ని తొలగించడానికి ఉపయోగపడుతున్నాయని అన్నారు.మనం చేసే ప్రతి పనిలో ఫలితంపై ఆశపెట్టుకోకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని దాగి ఉన్న అనంతమైన శక్తిని పుణ్య కార్యాలకే ఉపయోగించాలని అన్నారు.అంతటి శక్తిని సత్కార్యాలకే కోసం వినియోగించేందుకు భగవద్గీత ప్రవచనాలు దోహదపడుతాయని అన్నారు. ఒకే చోట ఒకే సమయంలో వేల మంది సాధకులతో పరమ పవిత్రమైన భగవద్గీత పారాయణం చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, శాంతిని,సద్భావనను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. అంతకుముందు దత్త పీఠంకు చెందిన రమ్యశ్రీ బృందం ఆధ్వర్యంలో భగవద్గీత సహస్ర గళార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మొరిశెట్టి లక్షాది,నిర్వాహకులు బోనగిరి విజయ్ కుమార్, బెలిదె శ్రీనివాసులు, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, నరేంద్రుని విద్యాసాగర్, గోపారపు రాజు, ఈగ దయాకర్, రాచకొండ శ్రీనివాస్, చల్లా లక్ష్మికాంత్, చల్లా లక్ష్మి ప్రసాద్, సోమా ప్రవీణ్, గుండా వెంకన్న, బోనగిరి నాగలక్ష్మి, వనం మాధవి, పట్టణ ప్రముఖులు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రత్యేక శిబిరాన్ని సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (సర్)లో భాగంగా డ్రాఫ్ట్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పంపిణీ ప్రత్యేక శిబిరాన్ని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సందర్శించారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలోని 177వ పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓ పార్నందుల ప్రతిభ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎస్పీ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు పంపిణీ చేస్తున్న నోటీసుల వివరాలు, నోటీసుల ప్రకారం ఓటర్లు ఇవ్వాల్సిన ధృవీకరణ పత్రాలు, ఇతర అంశాలను బీఎల్ఓను అడిగి తెలుసుకున్న అనంతరం పలువురు ఓటర్లకు నోటీసులను స్వయంగా అందించారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డీఎస్పీ, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలనపై బాసరలో బీఆర్ఎస్ పార్టీ నేతల నిరసన



ప్రజాస్ఫూర్తి, భైంసా: కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గం బాసర మండలం లాబ్ది గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు డాక్టర్ పడకంటి రమాదేవి ఆధ్వర్యంలో గ్రామంలో పరిసరాల పరిశుభ్రతను చేపట్టి తమ నిరసనను తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు కాలేదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. మోసపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి అంటూ బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు నినాదాలుచేశారు. యువత, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## శ్రీ లక్ష్మి గణపతి ఆలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని గుండ్లగడ్డ శ్రీ లక్ష్మీ గణపతి దేవా లయంలో 39 ఏళ్లుగా కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడంతో పాటు ఆ లయ అభివృద్ధికి కృషి చేసేందుకు నూ తన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాబోయే రెండేళ్ల పాటు కమిటీ ఆలయ అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణలో సేవలందించనుంది. గౌర వ అధ్యక్షుడిగా వద్నల లింగమూర్తి, అ ధ్యక్షుడిగా గట్టు రమేశ్, ఉపాధ్యక్షుడిగా చిదిరాల బాబురావు, ప్రధాన కార్యదర్శి గా గుధినేని త్రయంబకేశ్, కోశాధికారిగా కోయలకర్ శేషు విరాట్‌జీ ఎన్నికయ్యా రు. సహాయ కార్యదర్శులుగా ఆకుల నరేష్, గోగికర్ శివాజీ, కొత్తపల్లి సత్త య్య, ఆర్గనైజర్‌గా చెల్లోజు నవీన్ చారి బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య సల హాదారులుగా ఎర్రమల్ల సుధాకర్, మి ర్యాల రమేష్,కొండ వీరేశం,ఆర్మీ ప్రవీణ్ కుమార్, మురళి ఎంపికయ్యారు.నూత న కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వ హించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజా పాలన సక్సెస్

*** జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలన అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన సాగిస్తున్నదని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పాలన సక్సెస్ అయిందని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు నెంబర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రైతు రాజ్యం ఏర్పాటుకు రైతుల కోసం అనేక పథకాలను చేపట్టిందన్నారు. రైతులకు రుణమాఫీ ,ఎకరాకు 12000 రైతు భరోసా , ఉచిత విద్యుత్, సన్న ధాన్యానికి బోనస్ , ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు , మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లాంటి రైతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం పట్ల ప్రజలు సుఖంగా ఉన్నారని రాబోయే రెండు సంవత్సరాల కాలంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని * కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, 2029 లో జరిగే ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం విజయదుందుభి మ్రోగించడం ఖాయం అని ఆయన అన్నారు..

## పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

**– పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పోలీస్ శాఖలో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉచిత శిక్షణ కోసం 1216 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 1030 మంది స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష ప్రశాంతంగా, క్రమబద్ధంగా, పారదర్శకంగా జరిగేలా పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. జిల్లాలోని ఐదు సబ్-డివిజన్ల పరిధిలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. కొత్తగూడెం సబ్-డివిజన్‌లో సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, పాల్వంచ సబ్-డివిజన్‌లో అనుబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్స్, ఇల్లందు సబ్-డివిజన్‌లో గవర్నమెంట్ హై స్కూల్ (జె.బి.ఎస్.), మణుగూరు సబ్-డివిజన్‌లో శ్రీ చైతన్య టెక్నో హై స్కూల్, భద్రాచలం సబ్-డివిజన్‌లో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌ను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, పరీక్షా ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులకు సూచనలు చేశారు. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణలో సబ్-డివిజన్ పోలీస్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొని పరీక్షా ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

## చెరువులు నింపాలి అని ఆలోచన లేకపోవడం బాధాకరం

*** భక్త రామదాసు ఎత్తిపోతల ఆయకట్టు పరిధిలో తీవ్ర నీటి ఎద్దడి**

*** బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, పాలేరు : గత కొన్ని శతాబ్దాలుగా బుక్కెడు నీళ్ల కోసం గోస పడుతున్న ముఖ్యంగా కూసుమంచి, తిరుమలయపాలెం మండల రైతులకు నేటికి బుక్కెడు నీళ్ల కోసం ఎదురు చూపులు తప్పటం లేదు మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఈ ప్రాంత రైతులు గోస పట్టదా అని అడుగుతున్నాం. శతాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలో మోసం పోయిన ఈ ప్రాంతం ప్రజలకు సొంత రాష్ట్రం ఏర్పడిన కూడా నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. పాలేరు రిజర్వాయర్ తలాపున ఉన్న చెరువుల్లో, బావులలో చుక్క నీరు లేక ఇబ్బందులు పడుతున్న మంత్రికి కనిపించక పోవడం విడ్డూరంగా ఉంది. కనీసం పశువులకు, ఈ ప్రాంత ప్రజలకు కనీసం త్రాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కూడ ప్రభుత్వం లో చెరువులు నింపాలి అని ఆలోచన లేకపోవడం బాధాకరం. భక్త రామదాసు ఎత్తిపోతల ఆయకట్టు పరిధిలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొని ఉంది. ఐనప్పటికీ మంత్రి , అధికారులు ఈ ప్రాంత రైతులు పట్ల వివక్షా చూపటం తగదు.ఇప్పటికైన మంత్రి పొంగులేటి తక్షణం స్పందించి కూసుమంచి మండలం, తిరుమలయపాలెం మండల పరిధిలోని అన్ని చెరువులను భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా త్వరితగతిన నింపాలి అని డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే ఈ ప్రాంత రైతులు తరపున పోరాటం చేస్తాం అని తెలియ చేస్తున్నాము.

## పోలీస్ ఉద్యోగార్థులకు 70 రోజుల ఉచిత శిక్షణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న జిల్లా యువతకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ అండగా నిలుస్తోంది. శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత డేస్ స్కాలర్ తరగతులతో పాటు గ్రౌండ్ కోచింగ్‌ను 70 రోజులపాటు అందించనుంది. ఉచిత శిక్షణ కోసం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో దరఖాస్తులు స్వీకరించగా.. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభ్యర్థులకు శారీరక పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 350 మంది యువత హాజరయ్యారు. అనంతరం సింగరేణి హైస్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. రాత పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరిశీలించారు. పరీక్షలు రాస్తున్న అభ్యర్థులతో మాట్లాడి వారి సన్నద్ధతను తెలుసుకున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన వారికి 70 రోజులపాటు ఉచిత డేస్ స్కాలర్ తరగతులతో పాటు గ్రౌండ్ కోచింగ్ ఇస్తామని అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులు క్రమశిక్షణతో చదువుతూ శారీరకంగా సిద్ధం కావాలని సూచించారు.జిల్లా నిరుద్యోగ యువతకు అందుబాటులోకి వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు రత్నం, సంతోష్‌కుమార్, కాశీరాం, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లగొండలో బీఆర్ఎస్ ఆటోలతో నిరసన!

*** ఆటోపై ఎక్కి కూర్చుని ఉత్సాహంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డిహల్‌చల్**




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనను నిరసిస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఆటోల ర్యాలీ నిర్వహించారు. వందలాది ఆటోలతో పట్టణ పురవీధుల్లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన చేపట్టారు. ఆటోపై కూర్చొని భూపాల్ రెడ్డి సందడి. కార్యకర్తల్లో జోష్! నింపిన మాజీ ఎమ్మెల్యే. ఆటోపై కూర్చొని ఉత్సాహంగా వందలాది ఆటోలతో పురవీధుల్లో చక్కర్లు కొట్టిన భూపాల్ రెడ్డి ఆటో రైడ్‌కు జై కొట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వంపై నినాదాలు చేస్తూ ముందుకు సాగిన ఆటోల ర్యాలీ ఆటోపై భూపాల్ రెడ్డి స్టంట్ ర్యాలీలో ప్రత్యేక అట్రాక్షన్ గా మారిన మాజీ ఎమ్మెల్యే తీరు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ కొనసాగిన బీఆర్ఎస్ శ్రేణుల ఆటో ర్యాలీ. భూపాల్ రెడ్డి స్టంట్స్‌తో ర్యాలీలో ఒక్కసారిగా పెరిగిన జోష్. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ మదర్ సైదిరెడ్డి స్వయంగా ఆటో నడుపుతూ ఆటో కార్మికుల ఉత్సాహపరుస్తూ ర్యాలీలో పాల్గొన్నారు కార్యక్రమంలో టిఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## ఎస్ఐఆర్2026 ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పోలింగ్ స్టేషన్ నంబర్ 148ను అదనపు కలెక్టర్ సందర్శించి, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును ఆదివారం పరిశీలించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR2026)లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్,ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో బూత్ లెవల్ అధికారులు (BLOలు) చేపడుతున్న కార్యక్రమాలను, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు, అభ్యంతరాలు,సంబంధిత రికార్డులను పరిశీలించారు.ప్రత్యేక ప్రచార కార్యక్రమాల సందర్భంగా ఓటర్లు, దరఖాస్తుదారులు తమ పేర్లు ముసాయిదా ఓటరు జాబితాలో (Draft Electoral Roll) లేదో పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు. అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం ఫారం6, ఫారం-7, ఫారం8 ద్వారా క్లెయిమ్స్ మరియు ఆబ్జెక్షన్స్ సమర్పించవచ్చని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్2026 ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హులైన లేదా తప్పులున్న నమోదులను నిబంధనల మేరకు సరిచేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమం లో తహసీల్దార్ గణేష్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రియదర్శిని కాలేజీ ప్రిన్సిపాల్ కు డాక్టర్ నయీమ్ పాషాకు శిక్ష రత్న అవార్డు

*** అయనను అభినందించిన కళాశాల యాజమాన్యం**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో గల ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నయీమ్ పాషా కు టీచర్స్ డే సందర్భంగా హైదరాబాదులో అంతర్జాతీయ కనహ శాంతి వనం హరి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆయనకు టీచర్స్ డే సందర్భంగా బెస్ట్ అకాడమిక్ లీడర్ షిప్ శిక్ష రత్న అవార్డును టీజీ సిహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేస్తూ సత్కరించారు . గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారిని జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దటంలోనూ , ప్రత్యేకంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆత్మవిశ్వాసం , నైపుణ్యాలు , లీడర్ షిప్ లక్షణాలను పెంపొందించడంలోనూ , మహిళా సాధికారతకు ఆయన చేస్తున్న సేవలకు అవార్డును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు . అవార్డు లభించడం పట్ల ఆయన మాట్లాడుతూ అవార్డు రావడం పట్ల చాలా ఆనందంతో పాటు మరింత బాధ్యతను పెంచిందని, ప్రియదర్శిని డిగ్రీ అండ్ పిజి కళాశాల యాజమాన్యంతో పాటు , టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది నిరంతర సహకారానికి దక్కిన అవార్డు అని అన్నారు . అవార్డు లభించడం పట్ల కళాశాల యాజమాన్యంతో పాటు , కళాశాల టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి అని బాకీ కార్డులు పంపిణీ

*** మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు సందీప్ నాయక్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి న్యూస్ తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఉమ్మడి నల్గొండ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రివర్యులు గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి హుజూర్నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి నియోజకవర్గ యువ నాయకులు పిల్లుట్ల రఘు సారాధ్యంలో ఈరోజు గారకుంట తండ గ్రామంలో మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోతు సందీప్ నాయక్ ఆధ్వర్యంలో వ్యవసాయ కూలీల దగ్గరికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అన్నిటినినెరవేర్చాలని మహిళలకు 2500 రూపాయలు తక్షణమే ఇవ్వాలని విద్యార్థులకు స్కూటీలు ఇవ్వాలని కౌలు రైతులకు 15000 ఇవ్వాలని కళ్యాణ లక్ష్మికి తులం బంగారం ఇవ్వాలని కేసిఆర్ కిట్టు అనే పథకాన్ని కొనసాగించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరేందర్ నాయక్ మాజీ అధ్యక్షులు రవీందర్ నాయక్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాండుబాబు దివాకర్ నెహ్రూ శ్రీను మహిళలు ప్రమీల చిన్ని కమిలిసాలి గ్రామ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# రెక్కాడితే గానీ డొక్కాడని పేదలపై ప్రతాపం చూపించడం భావ్యం కాదు

* **మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రెక్కాడితే గానీ డొక్కాడని పేదలపై ప్రతాపం చూపించడం భావ్యం కాదని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్, వెంకట్రామరెడ్డి నగర్‌లలో పేద ప్రజలు ఎంతో కష్టపడి కట్టుకున్న 50 గజాలు, 80 గజాల చిన్న చిన్న ఇళ్లను జిహెచ్‌ఎంసి అధికారులు కూల్చివేయడంతో ఆదివారం ఆయన తో పాటు మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి , సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రబారి నందనం దివాకర్ , మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్ లు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌర్జన్యంగా కూల్చివేయడం అత్యంత విచారకరమన్నారు. బాధితులకు తక్షణమే న్యాయం జరిగే వరకు బిజెపి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ రంగా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గరిగే శేఖర్ , డివిజన్ అధ్యక్షులు మణికంఠ , ఎం శ్యామ్, నారాయణ గౌడ్, లక్ష్మీ నాథ్, దుర్గయ్య గౌడ్, మోయిన్, సంతోష్ గౌడ్, సతీష్ , బస్తీ పెద్దలు, ఇతర స్థానిక నాయకులు బాధితులు పాల్గొన్నారు.

# లారీ ఆగితే.. గంటసేపు రాకపోకలు బంద్!

* **పురాతన మర్రికుంట బ్రిడ్జి దుస్థితికి నిదర్శనం**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : పురాతన మర్రికుంట బ్రిడ్జి సమస్య మరోసారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను కలిగించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా మండలంలోని మర్రికుంట బ్రిడ్జిపై ఓ లారీకి అకస్మాత్తుగా రిపేర్ రావడంతో వాహనం బ్రిడ్జిపైనే నిలిచిపోయింది. దీంతో దాదాపు గంటసేపు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.ఇప్పటికే పురాతనంగా, ఇరుకుగా ఉన్న ఈ బ్రిడ్జిపై ఒక లారీ నిలిచిపోవడంతో మరో వాహనం పక్క నుంచి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసరంగా ప్రయాణించే వారు సైతం గంటకు పైగా వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఒకే లారీ ఆగిపోతే గంటసేపు ట్రాఫిక్ నిలిచిపోవడం, మర్రికుంట బ్రిడ్జి పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో ప్రజా ప్రతినిధులు అధికారులు అర్థం చేసుకోవాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలకు కీలకమైన మార్గంలో ఉన్న మర్రికుంట బ్రిడ్జి స్థానంలో విశాలమైన, ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన బ్రిడ్జిని వెంటనే మంజూరు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు

* **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డు పొందేందుకు ఏ పార్టీ నాయకుడి సిఫారసు అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ కేవలం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే, అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హత ఉన్న వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తారని తెలిపారు. ప్రజలు దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు.గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అడిగిన ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కూడా అందిస్తోందన్నారు. ఇందిరమ్మ హయాంలో పేద ప్రజలకు కూడు, గూడు, నీడ కల్పించేందుకు కృషి జరిగిందని, అదే తరహాలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కూడా ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని వీర్లపల్లి శంకర్ తెలిపారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మక్కిన బియ్యం పంపిణీ చేయడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ పరిస్థితిని కొందరు దళారులు తమకు అనుకూలంగా మలుచుకుని దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి పాలిష్ చేయించి, తిరిగి సన్న బియ్యం పేరుతో పేదలకు అధిక ధరలకు విక్రయించారని అన్నారు. ప్రస్తుతం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో బియ్యం పంపిణీ మరింత సులభతరం, పారదర్శకంగా మారుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ నాటకాలకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయి

* **కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై టీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ధ్వజం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పర విమర్శలతో రాజకీయ ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ విమర్శించారు. భూపాలపల్లి అంబేద్కర్ కూడలిని వేదికగా చేసుకుని ఇరు పార్టీలు పోటాపోటీగా ఆందోళనలు నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. 'భూపాలపల్లిలో మీ రాజకీయాలకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయి' అని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్న సందర్భంగా సంబరాలు చేసుకోవడం కంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ప్రత్యేక బడ్జెట్, బీసీ సబ్‌ప్లాన్ తదితర హామీలను అమలు చేయాలని కోరారు.అదేవిధంగా పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ప్రజా సమస్యల పేరుతో ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భూపాలపల్లి పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలను నియంత్రించి ప్రజలకు రక్షణ కల్పించాలని పోలీసు యంత్రాంగాన్ని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌పీ నాయకులు ఇనుగాల ప్రణయ్‌రాజ్, మోటపోతుల సమ్మయ్య, సురేందర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాసరలో రూ.354 కోట్లతో

## శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ సమగ్ర అభివృద్ధికి శ్రీకారం

* **రూ.20 కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
* **గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం :మంత్రి జూపల్లి కృష్ణారావు**



ప్రజాస్ఫూర్తి, భైంసా :తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర మద్యం, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.354 కోట్లతో చేపట్టనున్న ఆలయ సమగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన పుష్కర ప్రాంతాల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన వైద్యులు, అత్యవసర మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు.భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు.పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పుష్కర ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, భక్తులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ ఈవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.బాసరతో పాటు గోదావరి నదీ తీర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పుణ్యస్నానాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధితో పాటు భద్రతా చర్యలను పటిష్ఠం చేయనున్నట్లు చెప్పారు. పుష్కరాల కోసం చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. పనుల నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించినట్లు వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బాసర గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాదనలు, పనుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారులే పల్లెల అభివృద్ధికి మూలాలు

* **రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : రహదారులే పల్లెల అభివృద్ధికి మూలాలని గ్రామాలకు వెళ్లే అటువంటి రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో బొలిశెట్టి వారి గూడెం గ్రామానికి 7 కోట్ల 20 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఆయా గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం కలిగి ఉండాలని తెలిపారు. మెరుగైన రహదారి సౌకర్యం ఉన్న గ్రామాలన్నీ అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తెలిపారు. గడ్డిపల్లి స్మశాన వాటిక నుంచి కొనాయిగూడెం గ్రామం మీదుగా బొలిశెట్టి వారి గూడెం వరకు ఈ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మారుమూల పల్లెలుగా గుర్తించబడిన ఈ గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఇబ్బందులను గుర్తించి ఈ గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యాన్ని కల్పించేందుకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించి బీటీ రోడ్డును నిర్మించాలని, నాణ్యతలో రాజీ పడవద్దని ఆయన అధికరణ ఆదేశించారు. త్వరితగతన బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయన అధికారులను సూచించారు. అనంతరం గడ్డిపల్లి గ్రామ శివారులో 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ను అధికారులను ఆయన ఆదేశించారు. నిర్మాణ పనుల్లో జాప్యం ఉండకూడదని కోరారు. నిధులు సిద్ధంగా ఉన్నాయని అధికారులు కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ను జరుగుతున్న పనులపై మంత్రి ఉత్తమ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఏదైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, గడ్డిపల్లి మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి,మాజీ ఎంపీపీలు పైడిమర్రి రంగనాథ్, గోపాల్, మాజీ జెడ్పిటిసి పెండెం శ్రీనివాస్ గౌడ్, నాయకులు జుట్టు కొండ సత్యనారాయణ, మూలగుండ్ల సీతారాంరెడ్డి, ఆరే కృష్ణారెడ్డి, కటకం రమేష్, ఆరెపురి నారాయణ, చింతకాయల సైదులు, తాసిల్దార్ స్రవంతి, సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు, హుజూర్నగర్ సిఐ చరమందరాజు, గరిడేపల్లి నేరేడుచర్ల ఎస్ఐలు శ్రీకాంత్ గౌడ్, గోపాల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి రాకపోతే కేసీఆర్ రాజీనామా చేయాలి

* **ఎమ్మెల్యే పదవి నుంచి తప్పుకొని ఉపఎన్నికలకు అవకాశమివ్వాలి**
* **మహాధర్నాలో కాంగ్రెస్ నేతల డిమాండ్**
* **పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు**



హైదరాబాద్: నెలనెలా జీతం తీసుకుంటూ ప్రతిపక్ష నేతగా వెయ్యిరోజులుగా అసెంబ్లీకి హాజరు కాకుండా ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రతిపక్ష పాత్ర పోషించమని ప్రజలు భారాసకు అవకాశమిస్తే కేసీఆర్ ఫాంహౌస్‌కే ఎందుకు పరిమితమయ్యారని.. కుమారుడు, అల్లుడు అసెంబ్లీకి రావద్దంటున్నారా? కారణాలేమిటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత పాత్ర అంటే సీఎం తర్వాతి స్థానం అని, ఆ పాత్రను ఎందుకు పోషించడం లేదని నిలదీశారు. అసెంబ్లీకి రాలేని పరిస్థితి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉపఎన్నికలు పెట్టే అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆదివారం 'ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ'(పీసీసీ) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ నేతలు జగ్గారెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ "ధనిక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణను బీద రాష్ట్రంగా మార్చారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకి ఎప్పుడు అవకాశం ఇవ్వాలనేది ప్రజలు నిర్ణయిస్తారు. ప్రతిపక్ష నేత హోదాని కేసీఆర్ అపహాస్యం చేయడం సరికాదు. ప్రభుత్వం తప్పులు చేస్తే ప్రతిపక్షాలు ఎత్తిచూపాలి గానీ అసత్యాలు ప్రచారం చేయడం సబబు కాదు. గతంలో కళాకారులను అవమానించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రజల ఆకాంక్షలు ఆశయాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పాలన అందిస్తోంది. కేటీఆర్ చదువు గురించి మాట్లాడుతున్నారు. చదువు కాదు.. సంస్కారం కావాలి. మేం బాగా పనిచేస్తున్నందున మళ్లీ మళ్లీ గెలిచి 2040 వరకూ అధికారంలో ఉంటాం. తప్పిదాలు జరిగితే సరిదిద్దుకుంటాం. భాజపా నేతలు వ్యంగ్యంగా మాట్లాడటం తప్ప చేసిందేమీ లేదు. భాజపాలో బీసీ నాయకులు లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్, అర్వింద్ ఏం చేస్తున్నారు? తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన చేశారని మోదీ వద్దకెళ్లి వారు ఎందుకు చెప్పలేకపోతున్నారు? బీసీ కులగణన అంశం జనగణనలో చేసేలా మెడలు వంచేలా చేస్తాం"అని అన్నారు.

# ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడిని పరామర్శించిన టీపీయుఎస్ ఖమ్మం జిల్లా కమిటీ



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తురుగంటి అంజయ్య అనారోగ్యంతో ఖమ్మంలోని పూజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా టీపీయుఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మారేపల్లి వెంకట్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే అంజయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనకు అందరి దేవుళ్ల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని పేర్కొన్నారు.అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీపీయుఎస్ జిల్లా అధ్యక్షుడు అప్పని శంకర్రావు, జనరల్ సెక్రటరీ ఇనపనూరి పవన్ కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి బంక రవిబాబు, ఉపాధ్యక్షుడు జి. రామకృష్ణ, లీగల్ సెల్ ఇన్‌చార్జి నరసింహారావు, కింగ్స్ అధినేత ఉపేందర్, బొందయ్య తదితరులు పాల్గొన్నారు.



# మడమ నొప్పి వేధిస్తోందా.. ఇలా చేస్తే సరి

మడమ నొప్పితో బాధపడే వారు చిన్న చిన్న వ్యాయామాలతో వాటి నుంచి రిలీఫ్ పొందొచ్చు. కొందరిలో మడమ నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. పాదం కింద పెట్టగానే భరించలేనంత నొప్పితో పాటు అడుగు తీసి అడుగు వేయటమే కష్టంగా ఉంటుంది. రెండు మూడు గంటల పాటు ఇదే పరిస్థితి ఉండొచ్చు. కొందరికైతే రోజంతా మడమ నొప్పే ఉంటుంది. ప్లాంటార్ ఫేషియైటిస్ సమస్య ఇలాగే వేధిస్తుంది. పరుగెత్తేవారు, రోజులో ఎక్కువసేపు నిలబడే పనులు చేసేవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది. దీనికి మూలం పాదం అడుగున ఎముకలకు అతుక్కొని ఉండే బిగుతైన పొర 'ప్లాంటార్ ఫేషియా'వాపు. ఈ పొర పాదం వెనక, ముందు వేళ్ల ఎముకలకు అతుక్కొని ఉంటుంది. కానీ పాదం మధ్యలో ఎక్కడా అతుక్కోదు. ఊబకాయం, కదలకుండా ఉండటం, అతి వాడకం, చదును పాదాలు, పల్చటి చెప్పల వాడకం వంటి రకరకాల కారణాలతో అక్కడక్కడా చిరుగుతూ, మళ్లీ అతుక్కుంటూ వస్తుంటుంది. క్రమంగా దృఢంగా ఉండాల్సిన తంత్రులు క్షీణిస్తాయి. దీంతో పాదం వెనక ఎముక దగ్గర అతుక్కునే చోట వాపు తలెత్తి, నొప్పి మొదలవుతుంటుంది. దీని బారినపడ్డవారు మందులు వాడుతున్నా కొన్ని వ్యాయామాలు చేయటం మంచిది. ఇవి పిక్క, పాదం కండరాలు సాగేలా, బలోపేతమయ్యేలా చేసి.. నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

### బంతితో రుద్దటం

కుర్చీలో కూర్చొని లేదా నిల్చొని పాదం కింద చిన్న బంతిని పెట్టుకోవాలి. నెమ్మదిగా పాదాన్ని ముందుకూ వెనక్కూ 10 సార్లు కదిలించాలి. కాసేపు ఆగి మళ్లీ చేయాలి. దీంతో పాదానికి మంచి మర్దన లభిస్తుంది. బంతికి బదులు గుండ్రటి బాటిల్‌నూ వాడుకోవచ్చు. చల్లటి నీటిని నింపిన బాటిలైతే ఇంకా మంచిది. పాదం నొప్పి పుట్టినప్పుడే దీన్ని చేయాలి. బంతిని లేదా బాటిల్‌ను తగినంత ఒత్తిడితో అదమాలి. కానీ నొప్పి పుట్టేలా నొక్కకూడదు.



### మడమ దించటం

వేళ్లు, పాదం మధ్య భాగం మెట్టు మీద ఆనించి.. మడమలు గాల్లో తేలుతూ ఉండేలా నిల్చోవాలి. నెమ్మదిగా మడమలను మెట్టు అంచు కిందికి వచ్చేలా కిందికి దించాలి. ఈ సమయంలో పిక్క కండరాలు సాగుతున్న భావన కలుగుతుంది. తర్వాత నెమ్మదిగా మడమలను పైకి లేపాలి. ఇలా పది సార్లు చేసి, విశ్రాంతి తీసుకోవాలి. మరోసారి ఇలాగే చేయాలి. దీన్ని చాలా నెమ్మదిగా, కదలికలను నియంత్రణలో ఉంచుకొని చేయాలి. తూలకుండా చూసుకోవాలి. మెట్ల పక్కన రెయిలింగ్‌ను పట్టుకోవాలి.

### మడమ తిప్పటం

నేల మీద కూర్చొని, కాళ్లు స్ట్రెయిట్గా చాపాలి. ఎడమ కాలును కుడి కాలు మీద మోపాలి. కుడికాలుకు రబ్బరు బ్యాండును కట్టి, దాన్ని ఎడమ పాదం వెనక నుంచి తేవాలి. రబ్బరు బ్యాండును చేత్తో గట్టిగా పట్టుకోవాలి. కుడి పాదాన్ని నెమ్మదిగా ముందు వైపునకు చాచాలి. ఈ సమయంలో పాదం వెలుపలి వైపునకు సాగేలా చూసుకోవాలి. కాసేపు అలాగే ఉండి, యథాస్థితికి రావాలి. దీని పది సార్లు చొప్పును రెండు పర్యాయాలు చేయాలి.పాదం మరీ ఎక్కువగా నొప్పి పుట్టకుండా చూసుకోవాలి.





### కాలి వేళ్లతో తువ్వాలు చుట్టటం

కుర్చీలో తిన్నగా కూర్చోవాలి. నేల మీద తువ్వాలు పరచి, దాని మీద ఒక పాదాన్ని పెట్టాలి. కాలి వేళ్లతో తువ్వాలును పట్టుకొని, కుర్చీ వైపు మడవటానికి ప్రయత్నించాలి. దీన్ని 10 సార్ల చొప్పున రెండు పర్యాయాలు చేయాలి. పాదం మొత్తం నేలకు ఆనించి ఉంచాలి. కేవలం వేళ్లతోనే ఈ వ్యాయామం చేయాలి.



### పాదం పొర సాగదీత

కుర్చీలో కూర్చొని, ఒక కాలును మోకాలు మీదికి తీసుకురావాలి. ఒక చేత్తో మడమను, మరో చేత్తో వేళ్లను పట్టుకోవాలి. నెమ్మదిగా వేళ్లను వెనక్కి లాగాలి. ఈ సమయంలో పాదం అడుగు భాగం సాగుతున్న భావన కలుగుతుంది. వేళ్లను 20 సెకన్ల పాటు అలాగే పట్టుకొని, విశ్రాంతి తీసుకోవాలి. దీన్ని మూడు సార్లు చేయాలి. నెమ్మదిగా వేళ్లను సాగదీయాలి. ఎక్కువగా నొప్పి పుట్టకుండా చూసుకోవాలి.

### పిక్క సాగదీత

చేతులకు అందేంత దూరంలో గోడకు ఎదురుగా తిన్నగా నిల్చోవాలి. గోడ మీద చేతులను ఆనించాలి. రెండు పాదాలు నేల మీద సమతలంగా ఉండాలి. ఒక కాలును ముందుకు తెచ్చి, చేతులతో గోడను నొక్కుతూ ముందుకు వంగాలి. ఈ సమయం లో పిక్క భాగం సాగుతున్న భావన కలుగుతుంది. 20 సెకన్ల పాటు అలాగే ఉండి, యథాస్థితికి రావాలి. రెండో కాలుతోనూ ఇలాగే చేయాలి. ముందుకు వంగినప్పుడు వెనక కాలు, నడుం స్ట్రెయిట్గా ఉండాలి. మడమ నేల మీది నుంచి పైకి లేవకూడదు.

# రోజుకో బత్తాయి.. ఆరోగ్యానికి మేలోయి

బత్తాయిలు.. ఇవి రెగ్యులర్‌గా తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచివి. ఇందులో ఎక్కువగా విటమిన్ సి ఉంటుంది. దీని వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. శరీరంలోని ఫ్రీ రాడికల్స్ తగ్గిపోతాయి. వీటితో పాటు మరిన్ని లాభాలు కూడా ఉన్నాయి. వాటన్నింటి గురించి తెలుసుకుందాం.



### జీర్ణక్రియ..

బత్తాయిల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యల్ని దూరం చేస్తుంది. ఇందులోని ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల ఎక్కువగా మనం జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయి. బత్తాయిల్లో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. దీంతో చాలా వరకూ క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా పోరాడతాయి. దీంతో హ్యాపీగా వీటిని తీసుకోవచ్చు. అదే విధంగా, ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ అలర్జీలను కూడా తగ్గిస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల చాలా వరకూ అలర్జీలు తగ్గిపోతాయి.

### షుగర్ ఉన్నవారికి..

షుగర్ ఉన్నవారు బత్తాయి జ్యూస్ తాగడం చాలా ముఖ్యం. ఇందులో తక్కువగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి, వీటిని తీసుకోవడం వల్ల చాలా వరకూ ఉపయోగం ఉంటుంది.

### బరువు..

బరువు తగ్గాలనుకునేవారు కేలరీలను తక్కువగా తీసుకోవాలి. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఆ రెండు కూడా ఈ బత్తాయిల వల్ల సాధ్యం. బత్తాయిల్లో కేలరీలు తక్కువగానూ, పీచుపదార్థాలు ఎక్కువగానూ ఉంటాయి. దీని వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గి బరువు కూడా అదుపులో ఉంటుంది.

### గుండెకు ఆరోగ్యం..

బత్తాయిలు తినడం వల్ల గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. దీనికోసం ఇందులోని విటమిన్ సి, ఫైబర్ హెల్ప్ చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కాబట్టి, వీటిని రెగ్యులర్‌గా తినాలి. దంత సమస్యలు.. బత్తాయిల్లో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, వీటిని రెగ్యులర్‌గా తింటే ఆ పీచు పదార్థం కారణంగా దంత సమస్యలు దూరమవుతాయి. కాబట్టి, వీటిని రెగ్యులర్‌గా తీసుకోండి.

# ఇన్వర్టర్ వాడుతున్నారా.. జాగ్రత్తలు తప్పనిసరి

**సమ్మర్ వచ్చేసింది. ఈ సీజన్‌లో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉంటుంది. అలాగే కరెంట్ కోతలు కూడా ఉంటాయి. అందుకే చాలామంది ఇన్వర్టర్‌ను తెచ్చుకుంటారు. కరెంట్ లేనప్పుడు దీనిని వాడుతారు. అయితే, ఇంట్లో ఇన్వర్టర్‌ని ఉపయోగిస్తున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.**

- ఇన్వర్టర్ వైరింగ్‌ని చెక్ చేయాలి. వైరింగ్‌లో ఏదైనా లోపం ఏర్పడితే ఇన్వర్టర్ త్వరగా పాడవుతుంది. అందుకే వైరింగ్‌ను తరచుగా చెక్ చేస్తూ ఉండాలి. వదులుగా ఉన్న కనెక్షన్లను గట్టిగా బిగించాలి. అవసరమైతే దెబ్బతిన్న వైర్లను మార్చుకోవాలి.
- ఇన్వర్టర్‌ను సర్వీసింగ్ చేయాలి .వేసవిలో దానిపై ఎక్కువ లోడ్ పడుతుంది. తరచుగా సర్వీసింగ్ చేయడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవు. సర్వీసింగ్‌లో ఇన్వర్టర్‌ను శుభ్రపరచడం, ఆయిల్ మార్చడం, ఇతర అవసరమైన పనులు చేస్తూ ఉండాలి. ఇన్వర్టర్‌ను వెంటిలేషన్ ఉన్న పొడి ప్రదేశంలో పెట్టాలి. సూర్యకాంతి పడని చోట పెట్టాలి. గాలి సులభంగా అందేవిధంగా ఉండాలి. చుట్టూ తగినంత స్థలం ఉండాలి. ఇన్వర్టర్‌ను ఎప్పుడూ ఓవర్ లోడ్ చేయవద్దు. అవసరమైన మేరకే వాడాలి. ఇన్వర్టర్‌ను స్విచాఫ్ చేస్తున్నప్పుడు దీంతో నడిచే అన్ని ఎలక్ట్రానిక్స్‌ను ఆఫ్ చేయాలి. ఇన్వర్టర్ దగ్గర మండే పదార్థాలను ఉంచొద్దు.

ఇన్వర్టర్ బ్యాటరీని చెక్ చేస్తూ ఉండాలి ఇన్వర్టర్‌లో బ్యాటరీ అత్యంత ముఖ్యమైన భాగం. వేసవిలో బ్యాటరీ త్వరగా పాడైపోయే అవకాశాలు ఉంటాయి. బ్యాటరీలో ఉండే నీటిని తరచుగా చెక్ చేస్తూ ఉండాలి. అవసరమైతే నీటిని మార్చుతూ ఉండాలి. బ్యాటరీ టెర్మినల్స్ శుభ్రం చేస్తూ ఉండాలి. బ్యాటరీ ఛార్జింగ్ సామర్థ్యాన్ని పరిశీలిస్తూ ఉండాలి.



# MOVIE TIME





## మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ

'మార్షల్ ఆర్ట్స్ అంటే ఎదుటివారిపై దాడి చేయడం కాదు.. మనల్ని మనం రక్షించుకోవడమే. కలరిపయట్టు, కరాటే నేర్చుకోవడం వల్ల జీవితంలో క్రమశిక్షణ, ఏకాగ్రత, సమతుల్యత అలవడ్డాయి' అని నటి అనంతిక పేర్కొంది. రోమాంచకం మూవీలో నటించింది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే కళారూపాలపై ఆసక్తి ఉందని చెప్పారు. కూచిపూడి, భరతనాట్యం, కథకళితో పాటు కరాటే, కలరి పయట్టు నేర్చుకున్నట్లు తెలిపారు. ఉదయం నృత్యం, పాటలు నేర్చుకుని.. సాయంత్రం కరాటే సాధన చేసేదానినని చెప్పారు. ఈ కళలు తన వృత్తిగత, వ్యక్తిగత జీవితంలో ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పింది.



## డ్రాగన్ మూవీలో స్పెషల్ సాంగ్.. ఇద్దరు భామలతో ఎన్టీఆర్ స్టెప్పులు!



ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. వర్కింగ్ టైటిల్‌గా 'డ్రాగన్', 'బ్రూస్ లీ' పేర్లు వినిపిస్తున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతోంది. ఈ మూవీ కోసం ఓ స్పెషల్ సాంగ్‌ను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారట. ఈ పాటలో ఎన్టీఆర్, రుక్మిణీ వసంత్‌తో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు కూడా స్టెప్పులు వేయనున్నట్లు తెలుస్తోంది. పాటలో విజువల్స్ గ్రాండ్‌గా ఉండనున్నాయని టాక్. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ మూవీగా నిలిపేందుకు ప్రశాంత్ నీల్ కష్టపడుతున్నారట. స్క్రిప్ట్ కోసం ఆయన చాలా సమయం తీసుకోవడంతో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

## ది ప్యారడైజ్ రిలీజ్‌పై క్లారిటీ



నాని హీరోగా దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్'. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదలైన 'ఏషనాగుల' సాంగ్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. మిలియన్ల వ్యూస్‌తో ఈ పాట యూట్యూబ్‌లో దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నాని సినీ ప్రయాణం 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. 'ది ప్యారడైజ్' రిలీజ్‌పై ఎలాంటి సందేహాలు అక్కర్లేదని స్పష్టం చేస్తూ.. ముందుగా ప్రకటించినట్లుగానే సెప్టెంబర్ 24న సినిమాను థియేటర్లలోకి తీసుకురానున్నట్లు ఓ వీడియో ద్వారా వెల్లడించారు. దీంతో రిలీజ్ విషయంలో నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. అయితే ఈ చిత్రాన్ని హిందీలో విడుదల చేసే ఆలోచన లేదనే ప్రచారం జరుగుతోంది. దీనిపై మేకర్స్ మాత్రం స్పందించలేదు. ఈ మూవీలో నానికి జోడీగా కయదు లోహర్ నటిస్తోంది.

## శాండల్‌వుడ్‌లోకి మాళవిక శర్మ

మాళవిక శర్మకు ఈ ఓనం ప్రత్యేకంగా నిలిచింది. మలయాళ చిత్రసీమలోకి 'ఖలీఫా'తో అడుగుపెట్టిన ఆమెకు కేరళ ప్రేక్షకుల నుంచి ఊహించని ఆదరణ లభించింది. వైశాఖ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్‌కు జోడీగా ఫిజా పాత్రలో కనిపించింది. కొత్త భాష అయినప్పటికీ ప్రేక్షకుల స్పందన తనను ఆశ్చర్యపరిచిందని మాళవిక తెలిపింది. మలయాళంలో మరిన్ని సినిమాలు చేయాలనే ఆసక్తి ఈ అనుభవంతో పెరిగిందని చెప్పింది. భాష అర్థం కాని సందర్భాల్లో పృథ్వీరాజ్ ఎంతో సహకరించారని, దర్శకుడు వైశాఖ్ కూడా పాత్రను తీర్చిదిద్దడంలో మార్గనిర్దేశం చేశారని పేర్కొంది. తెలుగులో 'నేల టికెట్'తో సినీ ప్రయాణం ప్రారంభించిన మాళవిక.. తమిళంలోనూ నటించింది. ఇప్పుడు మరో కొత్త భాషలోకి అడుగుపెడుతోంది. గణేశ్ సరసన నటిస్తున్న 'బృందవిహారి'తో కన్నడ చిత్రసీమకు పరిచయం కానుంది. ఇందులో మీరా అనే కృష్ణభక్తురాలి పాత్రలో కనిపించనుంది. నటనకు ప్రాధాన్యం ఉన్న ఈ పాత్ర తనకు సవాలుగా అనిపించిందని మాళవిక చెప్పింది. భాషలు మారుతున్నా.. బలమైన పాత్రలు చేస్తూ మంచి నటిగా ఎదగాలన్నదే తన లక్ష్యమని ఆమె స్పష్టం చేసింది.

## శిరీష ప్రేమలో పడతారు

- అనస్వర రాజన్

మీరందరూ శిరీష పాత్రతో ప్రేమలో పడతారని అని హీరోయిన్ అనస్వర రాజన్ పేర్కొంది. కుమారి 21ఎఫ్' ఫేమ్ పల్నాటి సూర్యప్రతాప్ 'అంతా రాములోరు చూసుకుంటారు' మూవీని తెరకెక్కిస్తున్నారు. గోదావరి ప్రాంతం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో సంగీత్ శోభన్, అనస్వర జంటగా నటిస్తున్నారు. ఇద్దరు మారుతి–శిరీష పాత్రల్లో కనిపించనున్నారు. ఈ మూవీకి సంబంధించిన గ్లింప్స్‌ను చిత్రబృందం ఆదివారం లాంచ్ చేసింది. ఈ సందర్భంగా ఈవెంట్‌లో అనస్వర గోదావరి జిల్లాల్లో షూటింగ్ అనుభవాలను పంచుకున్నది. 'చాలా అందమైన ప్రదేశం. మంచి మనసున్న ప్రజలు.. అచ్చం ఒక చిన్న కేరళలా అనిపించింది. అక్కడ షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం. తపేశ్వరం కాజా కూడా చాలా నచ్చింది' అని చెప్పింది. ఇక ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్, వీజీబీ ఫిల్మ్స్ బ్యానర్స్‌పై ధీరజ్ మొగిలినేని, గిరి బాబు వల్లభనేని నిర్మిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మీ భూపాల్ కథ అందించగా, మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. రావు రమేశ్, రోహిణి, రఘుబాబు, అలీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.